

# పాకానబడ్డ భావగీతి.

పూడిపెద్ది వెంకటరమణయ్య

"సేలం భమవిలాస్" అని బోర్డు తగిలించి ఉంది ఆ యింటి గోడకు. కాఫీ త్రాగుదా మని మొక్కుకుంటున్నాను. పెద్దంచుల పంచ, పెడ బొత్తాయిల లాల్చీ, భుజాలదాకా చెంప జుట్టులు వ్రేలాడే గిరజా, క్రాపింగు తలా, అయ్యరో ఆంధ్రుడో తెలియలేదు. ఆతడు వచ్చి పరాకుగా చూస్తూన్న నాచెయ్యి అందుకొని కుదుపుతూ, "దయచేయండి కవి గారూ! నిన్న మీరు మీ పద్యాలు టౌను హాలులో బాగా చదివేరె!" అంటూ చేయి పట్టుకొని నన్ను లోపలకు తీసుకొని వెళ్లేడు. ఆత డంతటి రస గ్రహణ పారీణుడని నాలో నేను సంతోషిస్తూ లోపలకు వెళ్లేను. అప్పటికే అయిదారుగురు లోన బల్లలదగ్గర కూర్చుండి ఫలహారాలు చేస్తున్నారు.

అక్కడకు నేనుకూడా పోయి కూర్చుందా మని అటు మళ్ళబోయేను. "అటు కాదు సార్! ఇట్టా రండి!" అని నన్నొక చిన్న గది లోనికి తీసుకొని వెళ్ళినాడు. ఆ గదిలో ఒక చిన్న బల్లా దాని దగ్గర రెండు కుర్చీలూ ఉన్నాయి. ఒక దానిలో ఆతడు కూర్చుండి రెండవదానిలో నన్ను కూర్చుండమని సంజ్ఞ చేశాడు. నేను కూర్చున్నాను. "భావ కవిత్వంలో కవి లీలగా కనబడుతూ ఉండాలి కాదు సార్" అన్నాడు. ఆప్రశ్న ఏమిటో సరిగా అర్థం చేసుకోకుండానే ఔనన్నాను. నా ధ్యానమంతా కాఫీమీద ఉంది. "ఒక్కప్పుడు కాఫీ చేయిస్తారా?" అన్నాను. ఎప్పుడూ కాఫీ చేయించను సార్—నా పాకం వేరు—నా తయారు వేరు—ఇపుడేలా? రుచి చూస్తే మీకే తెలుస్తుంది. సలక్షణంగా ఉంటుంది.

"ఔను గాని నేను ఉదయాన్నే అలాటివేవీ ఇష్టపడను."

"మీలాంటి వాళ్ళలాగంటే ఎలాగ సార్—మరి పెద్దలుగదా మమ్మల్ని ఎంకరేజ్ చెయ్యారూ? రుచి చూడండి బాగు లేకపోతే నిర్మొగ

ంగా

మాటంగా చెప్పేయండి...ఏమి ఊరు కున్నారు!— తెమ్మన్నారా?...అయిదు నిమిషాలే సార్ —మీ ముఖాన్ని తొందర కనబడుతూందే.

"అయితే తెప్పించండి—నాకిలా టప్పు డేదీ అలవాటు లేదని."

"నాకోసం మీరు కాస్త తాళండి సార్ తెచ్చేస్తాను" అంటూ లోపలకు వెళ్ళిపోయాడు. కాఫీవాసనా; కప్పుల చప్పుడూ? నాకు మరింత ఆకలి వేస్తూంది. అలా కూర్చున్నాను బల్ల మీద. అత డింకా రాడు. లోపలకు చూచేను. అక్కడ ఏదో వెతుకుతున్నా—"అయ్యా, వేగంగా కాఫీ ఇప్పించండి! తరువాతనన్నీ చూచుకోవచ్చును.

"కాఫీ కూడా తయారు చేస్తున్నాను సార్" అంటూ లోపల యేదో వ్రాసుకుంటూన్న పిల్లవానిని చూపించేడు. నాకేం బోధపడక అలా కుర్చీలో కూర్చున్నాను. కొంత సేపటి కాతడు తిరిగీ వచ్చేడు. చేత్తో కాఫీ కప్పూ లేదు ఫలాహారపు పళ్ళెమూ లేదు. లోపలకు చూచేను. ఇంకా ఆ పిల్లవాడలా తల వంచి వ్రాసుకుంటున్నాడు. నాకు ఆకలి జోరయి పోతూంది.

"ఏమిటండీ అయ్యరు గారూ! ఇంకా ఎంత సేపు తాళేది. కాఫీ తెప్పించండి చాలు; ఇప్పుడు మరేంవద్దు.

"మీలాటి వాళ్ళకిచ్చినప్పుడు జాగ్రతగా కాఫీ చేయించాలి కాదూ? నాకొర కొక్క అయిదు మినిట్లు తాళలేరా? వచ్చేస్తున్నాడు; ఈ పనిలోనే ఉన్నాడు. నేనే చేస్తును గాని నా వ్రేలిమీద ఎసరు పడి పొక్కింది. ఈ రోజుల్లో పాయ్రేటే అందరి సొమ్మూ అయింది. తెలుగులో కొన్ని బందుకట్లు తీసేడంవల్ల భాష ధారాళంగా ప్రవహిస్తుంది. ఇంగ్లీషు కూడా తోడౌతుంది నోటి కవిత్వానికి.

ఏభాష కావలిస్తే ఆ భాషే తోడవుతుంది గాని ఏదీ కాఫీ? నే నింక కనిపెట్టుకొని ఉండలేను.

శ్రీనివాసా! ఆ కాఫీ యిటు తీసికొని రా. కవిగారు తొందర పడుతున్నారు. మాలాటి వాళ్ళ కిదేసమయం సార్. మీలాటి సరసులు దొరికినప్పుడే మాలాటి వాళ్ళ పనివాడి తనం చూపించాలి . . . మీకు చాలా తొందరగా ఉందే . . . శ్రీనివాసా! ఎంత సేపు చేస్తున్నావురా? ఈపాటి కాఫీ చెయ్యడానికే ఇంత సేపా? కవిగారు వెళ్ళిపోయాక నీ తయారీ ఎందుకూ?

చేత్తో ఒక పావుటావు కాగితం పట్టుకొని ఊదుతూ శ్రీనివాసం వచ్చేడు నేను కూర్చున్న బల్లదగ్గరకు. దానిమీద ఏవోలతలు అచ్చు బోర్డరులాగు వ్రాసి ఆనడుమ నేదో పద్యం లాగు పంక్తులు తీర్చి వ్రాసి ఉంది. అది బల్ల మీద నా యెదుట పడేశాడు.

ఇదేమిటిది? కాఫీ యేదీ? అన్నాను.

శ్రీని:—ఇది కాఫీయేనండి సార్.

అయ్యరు:-(కళ్ళు విశాలంగా విప్పి చూచి) ఔనండీ సార్...శ్రీనివాసా ఒరిజనల్ ఏదీ?

శ్రీని:—(నలిగిన కాగితం మడత వాని కందించేడు).

నేను:—అయ్యరుగారూ? ఏమిది? నే నడిగింది కాఫీ—ఈ పావుటావునా ఆకలి తీరుస్తుందా?

ముందుగా ఇది చూడండి సార్—అని ఆ కాగితం నాకు ఎదురుగా అమర్చేడు—అందిట్లు ఉన్నది.



ప్రేయసీ!

నిగనిగ లాడు
నీపై నాచూడ్కులు బరిపి
నిలు పోపకోడి
మిగుల వల పూరి
దా పంపు నీలేఖ నందు కోవా?
మరుచేగోడీ!
నీ కేదీ ఉపమ?
ఇది ప్రేమాంకురమా
కాలు సేతులకు బొండా?
ఇందుండి విడివడ
నుపాయ మబలలు గారె?
పూవు తూపులను నా కొరకాపి
మరు డిక మసలడు
రమ్మా! శ్యామా!

చదివేను—విస్మయుడ నయిపోయాను—మాట రాక అట ప్రమాన్పడిపోయాను.

"ఏమండీసార్! అలా ఊరుకున్నారు—భావకవిత్వ లక్షణాలు లేవా? మొదట మీటరు అతిక్రమించేనా? 14 పాదాలలో పూర్తిచేసేనా? Personal element నిండా ఉందా? ప్రణయం వస్తువుగా గ్రహించేనా? క్లైమాక్సు చూపించేనా? ఇంకేం కావాలి సార్"—? అది ఆ బల్లమీద విడిచేసి లేచేను.

"దానిని మీరు తీసుకుపొండి. మీకొరకే కాపీ చేయించేను. మీ అభిప్రాయం తరవాత పంపండి సార్. థ్యాంక్సు.

అది తీసికొని మరి నేనక్కడ నిలబడలేదు. మరొక కాఫీ హోటలుకు పోయాను.

మీకు కావలసిన చక్కని ఉడుపులు, గుడ్డలు, పలువిధములైన స్వదేశీ సిల్కు చీరెలు, జాకెట్టు రకములును

కేశవరామ్ అండ్ కంపెనీ,

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసున దొరకును. మంచి సరకులు! వెల సరసము!